కథ

# సాలెగూడు

- జి.యస్.వి. సత్యనారాయణ

'ఒరేయ్ మూర్తి .... రేపు ఎలాగైనా ఇవ్వాలి' ఆఫీసు నుండి బయటకు వస్తూ ప్రాధేయపూర్వకంగా అడిగాను.

'చెప్పాను కదా .... రేపు చూద్దాం ... అయితే ఫస్టుకి తిరిగి ఇచ్చెయ్యాలి ........' కరాఖండిగా ఉంది మూర్తి స్వరం.

'ఇప్పుడు అలాగే అంటావు ..... తీరా అప్పు తీర్చడానికి నేను పదిసార్లు అడగాలి ......'

'ఏదో ఒక్కసారి అలా జరిగింది. ఈసారి ఫస్టుకి నీ చేతిలో పెడతా.

'సరే .....'

మూర్తిని నేనడిగింది మూడొందల రూపాయల అప్పు. అదికూడ గత నాల్గురోజులనుండీ అడుగుతున్నాను. ఆ డబ్బుల్తో నా భార్య సుజాతకు ఒక చీర .... ఇతరత్రా చిన్న ఖర్చులు .... అసలు అప్పుచేసే కొనాలా ? అని అడగవచ్చు. పాపం సుజాతకు చీరకొంటానని రెండు నెలల నుండీ ఆశపెడుతూ వస్తున్నాను. పెళ్ళయ్యాక నాతోపాటు నా కష్టాలను పంచుకుంటూ వస్తోంది. కాని ఎవరి సహనానికైనా ఓ హద్దుంటుంది. సుజాతలో మార్పు గమనించక పోలేదు. పోయిన ఫస్ట్ తారీఖునాడే కొందామనుకున్నాను. ఇంతలో ఊర్నించి అమ్మరావడం. ఒంట్లో బాగులేక డాక్టర్ల చుట్టూ తిరగడం ..... వడ్డీ కడుతోన్న పదిహేను వేల అప్పుకే మరికాస్త తోడయింది. అమ్మకు మంచినీళ్ళలా డబ్బులు ఖర్చవుతోంటే సుజాత ముఖంలో రంగులు మారాయి. అసలు అప్పులో అప్పు .. ఖర్చులో ఖర్చు .... అప్పుడే కొనెయ్యాల్సింది.

కానీ ఏం చేస్తాం ? కష్టాల్లో మునిగి తేలుతూ ... నష్టాల్లో నడుస్తున్న ప్రయివేట్ కంపెనీలో చిన్న ఉద్యోగం. ఫస్ట్ వరకూ ప్రతిసారీ ఎదురుచూపులు. తీరా ఆ ఫస్ట్‌కి అన్ని అవసరాలు తీర్చలేని జీతం .... మరలా ఫస్ట్ కోసం ఎదురుచూపుల జీవితం. అసలు నెలకు ముప్పై రోజులకు బదులు ఇరవై రోజులే ఉంటే ఎంత బాగుండేది !

అబ్బా. చాలా తలనొప్పిగా ఉంది. ఎందుకో ఈ మధ్య తరచూ వస్తోంది. కణతలు నొక్కుకున్నాను. ఎదురుగా టీ బడ్డీ. పోనీ టీ తాగుదామా కాస్త తగ్గుతుందేమో ! రెండు నిముషాలు నిలబడి రెండు రూపాయల కోసం ఆలోచించాను. తలనొప్పి మరికాస్త ఎక్కువయింది.

తప్పలేదు

టీ తాగి ఒక్కడుగు వేసానో లేదో .... నా చెప్పు మీద వెనకాల ఉన్నాయన కాలు పడింది. అంతే ... చెప్పు తెగింది ... పుటుక్కున.

'సారీ' .... క్యాజువల్‌గా చెప్పేసి వెళ్ళిపోయాడు.

మాస్టారు నా కాలిచెప్పు తెంపేసారు. జరిగిన

తారణనామ ఉగాది సందర్భంగా రంజని నిర్వహించిన
రాయప్రోలు రామకృష్ణయ్య స్మారక కథల పోటీలో ప్రథమ బహుమతి పొందిన కథ

నష్టానికి ఓ పది రూపాయలు ఇచ్చి వెళ్ళండి .... సారీ అంటే నా చెప్పు బాగవదు కదా..... అందామనుకున్నా. అసలు .... టీ తాగకుండా ఉండాల్సింది. మొత్తం నష్టాన్ని తల్చుకుంటుంటె బాధగా ఉంది.

ఇప్పుడీ చెప్పు ఎక్కడ కుట్టించుకోవాలి ? ఈ సెంటర్లో ఎక్కడ కుట్టించినా పదికి తక్కువ తీసుకోరు... అదే ఇంటిదగ్గర్లో చెప్పులు కుట్టే తాత ఉన్నాడు. మూడో నాలుగో యిస్తే చాలు ....

అయినా అక్కడిదాకా నడవడం ఎలా ? ఏడు రూపాయలు మిగల్చాలంటే తప్పదు. తెగిన చెప్పులో కాలుపెట్టి మెల్లగా నడవడం మొదలుపెట్టాను. నడకలో మార్పు .... ఎందుకో అందరూ నన్నే చూస్తున్న ఫీలింగ్ .... నేనూ కాస్త ఆగి దేన్నో చూస్తున్నట్లు నటింపు ..... మరలా నడక.

"ఏదో నాకో రూపాయి డబ్బులొస్తాయని మూడోసారి ఈ చెప్పుని కుట్టడం కానీ ...... నిలవదండి .... తెగిపోద్ది ...." నీ చెప్పుల హిస్టరీ నాకు తెలుసన్నట్లు చెప్పాడు తాత.

"ఫర్వాలేదు ... ఉన్నదాంట్లోనే కాస్తంత రిపేరు చేయి ..... ఇదే ఆఖరుసారి" కాస్తంత అభిమానం వదులుకునే చెప్పాను.

జేబులో ఉన్న చిల్లర మూడు రూపాయలు తీసి యిచ్చాను. ఓసారి నా ముఖం కేసి చూసి కళ్ళకద్దుకుని డబ్బాలో వేసుకున్నాడు.

పోనీ .... మూర్తి రేపు డబ్బులిస్తే కొత్తచెప్పులు కొనేస్తే......

ఉహు .... ముందు సుజాతకు చీర కొనాలి. ఆ తరవాతే ఏదైనా ....

పాపం సుజాత .... తన సహధర్మచారిణి ... ఏం మిగిల్చాడు తను ? జీవితంలో ఒక ఆనందమా ? బతుకులో ఏదైనా తియ్యదనమా ? కనీస అవసరాలు కూడా తీర్చకపోవడం భావ్యం కాదు .... ఉన్న నాలుగు చిరిగిన చీరలు ఎన్నిసార్లని కట్టుకుంటుంది.

బయటి వరండాలో కూర్చొని పుస్తకాలతో ఏదో కుస్తీలు పడుతున్నాడు బాబిగాడు .... నా పుత్రరత్నం.

'అమ్మా, నాన్న వచ్చారే ......' అరిచాడు.

చెప్పులను కుర్చీకిందికి తోశాను కనబడకుండా.

మంచినీళ్ళతో వచ్చింది సుజాత

మంచినీళ్ళు తాగుతుంటే ఎదురుగా చీరకు చిరుగు. ఆ చీరకు ఒక చిరుగే ఉన్నా ..... అది నా కళ్ళలో పడాలనే .... సుజాతకు చీరకట్టుకోవడంలో ఆ పాటి నైపుణ్యం ఉంది

అయినా రేపు మూర్తిగాడు డబ్బులిస్తే మొదట కొనేది సుజాత చీరే ... సర్‌ప్రయిజ్ చేయాలి.

'సుజా ... అమ్మేది ?'

"పక్కింటికెళ్ళారు .... చాలాసేపయింది ... అదిగో వస్తున్నారు ....."

'అమ్మా మాత్రలు ఉన్నాయి కదా .....'

'ఉన్నాయి బాబూ .... నాల్గురోజులు పోయాక చూద్దాం ... నేనలా గుడికెళ్ళొస్తా ........ పక్కింటి వనజ వస్తానంది తోడుగా'.

'అలాగే జాగ్రత్తగా వెళ్ళిరా .......'

పాపం ... అమ్మ .... డాక్టరు రోజుకి రెండేసి మాత్రలు వేసుకోమంటే ఒకటే వేసుకుంటూ నన్నాదుకుంటున్న మాతృమూర్తి.

'ఏవండీ ఆ బాబిగాడ్ని ... కాస్త చదివించండి ... బొత్తిగా పట్టించుకోవడం మానేసారు ....' మంచినీళ్ళ గ్లాసు

అందుకుంటూ అంది సుజాత.

'ఏరా బాబీ .... ఏం చదువు మొదలుపెట్టావ్'

'సైన్సు చదువుతున్నా'. వాడూ అదే స్టైల్లో చెప్పాడు.

'బాగా చదూకోవాలి.' రొటీన్ డైలాగే అని చూశాడు.

నిలబెట్టమని ..... ఫర్వాలేదు నాన్నా... అయిదు నిముషాలే కదా .... నుంచుంటానులే ....."

వాడి తల నిమిరాను.

"అయినా ఫస్ట్‌తారీఖుకి ఇంకా పదిరోజులే కదా ఉంది ... ఈ పదిరోజులు నుంచుంటే సరి నాన్నా ...."




"బాగాచదూకోవాలి అని చెప్పేస్తే సరిపోతుందా... స్కూల్ ఫీజ్ కట్టలేదని ఈ రోజు అయిదు నిముషాలు నుంచోబెట్టారంట. ఆ సంగతి చూడండి" చెప్పేసి లోపలికి వెళ్ళిపోయింది.

"నేనూ చెప్పాను నాన్నా ... మా టీచరుకి ... మా నాన్నగారు పనిచేస్తున్న కంపెనీ ఆర్థిక పరిస్థితి బాలేదు. త్వరలో కట్టేస్తారని ... అయినా ప్రిన్స్‌పాల్‌గారి ఆర్డరంట .... ఫీజు కట్టేదాకా రోజూ అయిదు నిముషాలు

"వీడికి కూడ ఫస్ట్ తారీఖు 'మాయాజాలం' బాగా తెలిసిపోయినట్లుంది".

"ఈలోగానే కట్టేద్దాములేరా ....."

పోనీ మూర్తి రేపిస్తానన్న డబ్బుల్తో ఫీజు కట్టేస్తే ? మరి సుజాత చీర సంగతేంటి ?

"నాన్నా .... నీకో సంగతి చెప్పాలి"

'ఏంటమ్మా .....'

"నానమ్మకు కళ్ళు సరిగ్గా కనపడ్డం లేదనుకుంటా... ఇంట్లో అన్నీ తన్నేనంకుంటుంది. కళ్ళజోడు

మార్చాలేమో....."

గొంతులో పచ్చివెలక్కాయ పడ్డట్లయింది

నిజమే .... నేనూ అమ్మ వచ్చిందగ్గర్నుంచీ గమనిస్తూనే ఉన్నాను.

"అలాగా నాకు తెలీలేదే (హరిశ్చంద్రా ... క్షమించెయ్యి) అవన్నీ నే చూసుకుంటా గాని నువ్వు చదువు మీద శ్రద్ధ పెట్టుకో ....."

మళ్ళీ తలనొప్పి మొదలైంది.

"సుజా ... కాస్త టీ పెట్టు" అరిచాను

టీ తాగి ఇంట్లోంచి బయట పడితే కాస్త మనసు నెమ్మదిస్తుందేమో ....

* * *

మూర్తి ఈ రోజు యిస్తానన్న అప్పు మరలా రేపటికి వాయిదా పడింది. దిగులుగా యింటిముఖం పట్టాను.

ఇంటికి వెళ్ళేసరికి అమ్మ గడపతన్నేసుకుందట. బొటన వేలికి ఇంతమందాన గడ్డకట్టిన రక్తం.

పాపం .... అమ్మ .... ఎంతో అందగా ఉండే నాన్న హఠాత్తుగా పోవడంతో జీవచ్ఛవంలా బతుకుతోంది.... ఆ తరువాత పెళ్ళిళ్ళయిన ఇద్దరి కూతుర్ల అవసరాలకు హారతిలా కరిగి పోయిందనే చెప్పాలి ... నన్ను ఇది కావాలని పాపం ఎప్పుడూ అడగలేదు .... నా సమస్యలను చూసి ! నన్ను ఎంత ప్రేమగా పెంచిందో నాకు తెలుసు ... పాపం యిప్పుడు .... ఆరోగ్య సమస్యలు ... ఆర్థిక సమస్యలు .... కళ్ళు సరిగ్గా కనపడక పడే అవస్థను కనిపెట్టకపోలేదు. కానీ కావాలనే పట్టించుకోని దౌర్భాగ్యస్థితి !

అమ్మను చూస్తుంటే గుండె తరుక్కుపోతోంది.

అమ్మను కంటి డాక్టరుకి చూపించాలి. మరలా మూర్తి రేపు యిస్తానన్న అప్పు గుర్తుకొచ్చింది.

అమ్మను వెంటనే కంటి డాక్టరు దగ్గరికి తీసుకువెళ్ళాలి. గురుమూర్తి గుర్తొచ్చాడు. గురుమూర్తి పక్కవీధిలోనే ఉన్న కంటి డాక్టరు దగ్గర పనిచేస్తున్నాడు. డబ్బులు తరువాత యిస్తానంటే ఒప్పుకుంటాడేమో .... బలవంతాన అమ్మను తీసుకువెళ్ళాను.

గురుమూర్తి ఉన్నాడు. పరిస్థితి వివరించాను. పేషంట్లందరూ వెళ్ళేదాకా ఉండాలన్నాడు. డాక్టరుతో మాట్లాడతానన్నాడు. గురుమూర్తికి థాంక్స్ చెప్పాను. రాత్రి తొమ్మిదన్నరవుతోంది. తలనొప్పితో తలంతా బరువుగా ఉంది. మొత్తానికి గురుమూర్తి డాక్టరుని ఒప్పించాడు.

అమ్మకు కొత్త ప్రిస్క్రిప్షన్ రాసియిచ్చారు. కళ్ళజోడు మార్చాలన్నారు. బయటకు వస్తోంటే తలనొప్పితో తలతిరిగి పోయేలా ఉంది. కుర్చీలో కూలబడ్డాను. గురుమూర్తి నా పరిస్థితి చూసి అడిగాడు.

నెలనుండీ వస్తోన్న తలనొప్పిని గురించి చెప్పాను.

ఓసారి డాక్టరు దగ్గర చూపిద్దాం అన్నాడు.

ఎంత వద్దంటున్నా ఫర్వాలేదు అంటూ తీసుకెళ్ళాడు. అమ్మకూడా బలవంత పెట్టింది.

"నువ్వూ అర్జెంటుగా కళ్ళజోడు వాడాల్సిందే ... లేదంటే మెదడులో నరాలకు సమస్యలు ఉత్పన్నమవుతాయి" అంటూ డాక్టరుగారు నా కళ్ళను పరీక్షించి ప్రిస్క్రిప్షన్ కాగితం చేతిలో పెట్టారు. నాకు వెంటనే పులిమీద పుట్ర సామెత గుర్తొచ్చింది. గురుమూర్తికి కృతజ్ఞతలు చెప్పి రేపు కలుస్తానంటూ అమ్మను తీసుకొని బయటకు నడిచాను.

"బాబూ ... నాదేం ఉంది కాని ముందు నువ్వు వెంటనే కళ్ళజోడు వేయించుకో బాబూ ....." అంటోంది అమ్మ ..... కాలి బాధను దిగమింగుకుంటూ.

ఆ రాత్రి నిద్ర పట్టలేదు.

మూర్తి **"రేపు"** తప్పక యిస్తానన్న మూడు వందలతో సమస్యల సమీకరణలు మారుతున్నాయి ....

నా చెప్పులు .... మరోసారి తెగిపోతే ఈసారి చెప్పులు కుట్టేవాడ్ని మారిస్తే సరి.

ఇక సుజాత చీర .... అర్థాంగి కాబట్టి ఫస్ట్ వరకూ ఆగవచ్చా ఏమో ?

బాబిగాడి **ఫీజు** .... "రోజుకి అయిదు నిముషాలే కదా .... నించుంటానులే నాన్నా .... ఫర్వాలేదు ఫస్ట్‌వరకూ"

బాబిగాడి మాటలు గుర్తొచ్చి కన్నులు చెమరుస్తున్నాయి.

**ఇప్పుడు కళ్ళజోడు** ఎవరు వేయించుకోవాలి ? మూర్తి యిచ్చే మూడు వందలతో ఎవరో ఒకరికే ఛాన్సు..... అది అమ్మకా ?

లేక

నాకా ?

తల పగిలిపోతోంది

***

మరుసటి రోజు ఆఫీసుకి వెళ్ళడంతోనే నా ఆశలకు రెండు గండ్లు పడ్డాయి ....

ఒకటి .... మూర్తి రేపు తప్పక యిస్తానన్న అప్పు గోడమీద రాసుకోవాల్సిందే అయింది .....

యిక రెండోది .... ఫస్ట్‌కి జీతాలు దాటే .... హెడ్ ఆఫీస్ నుండి వచ్చిన సమాచారం.

నవ్వొచ్చింది ...

'మధ్యతరగతి మందహాసం' .... ఎవరోగాని ఎంత అందమైన పేరు పెట్టారు ఈ నవ్వుకి.

"అప్పుకోసం ఇంకోచోట ప్రయత్నించాలి".

మనసు మాత్రం ఆలోచనలో పడింది **మామూలుగానే !** ❋

